ఆక్రమణ చెరలో

మదీనాబాగ్ ప్రధాన గెడ్డ



ప్రధాన గెడ్డను ఆక్రమించి నిర్మించిన పునాది



మదీనాబాగ్ ప్రధాన గెడ్డను ఆక్రమించి నిర్మించిన పునాది

- వర్షాకాలంలో పోటెత్తుతున్న వరద
- గ్రామంలోకి వస్తున్న వర్షపు నీరు
- భయాందోళనలో స్థానికులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని మదీనాబాగ్ ప్రధాన గెడ్డ ఆక్రమణ చెరలో చిక్కుకుంది. వర్షపునీరు ఈ గెడ్డ గుండా ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తుంది. జీఎస్ఎస్ఆర్ఎం కాలనీ నుంచి మదీనాబాగ్ వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఈ గెడ్డ ఉంది. మెడ్‌టెక్ నుంచి నుంచే వచ్చే వృథా నీటితో పాటు జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీలోని సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి వచ్చే వృథానీటితో పాటు కాలనీల నుంచి వచ్చే వాడుక నీరు ఈ గెడ్డ గుండా ప్రవహిస్తోంది. అలాగే వర్షాకాలంలో కూడా ఈ గెడ్డ నుంచి భారీ ఎత్తున వరదనీరు వస్తుంది. అయితే ఈ గెడ్డను కొంతమంది ఆక్రమించడంతో పాటు అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో రోజురోజుకూ ఇది కుచించుకుపోతోంది. వర్షాకాలంలో భారీగా వరదనీరు గ్రామంలోకి వచ్చేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిలో దుకాణాలు ఏర్పాటు చేయడం.. ఆపై ఆ దుకాణాల వెనుక ఉన్న గెడ్డను ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తుండడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలు తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బహిరంగగానే చెబుతున్నారు.

ఆక్రమణలు కనిపించలేదా!

గెడ్డ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక పెద్ద మొత్తం చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గెడ్డను పరిశీలించి, ఆక్రమణలు తొలగించి గెడ్డ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు. అలాగే గెడ్డ చివరి వరకూ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా దిగువకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

పెళ్లింట్లో చోరీ

పెదగంట్యాడ: మండలంలోని సీతానగరంలో ఓ పెళ్లింట్లో చోరీ జరిగింది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ. మండలంలోని సీతానగరంలో నంబారు శ్రీనివాసరావు అనే వ్యక్తి కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5న రాత్రి అతని సోదరుడు వెంకటేష్ వివాహాన్ని అతని ఇంటి సమీపంలో ఉన్న పాఠశాల మైదానంలో నిర్వహించారు. పెళ్లి సందర్భంగా ఇంటికి తాళాలు వేయకుండా తలుపు దగ్గరగా వేసి ఉంచారు. ఇదే అదునుగా నక్లెస్, నాలుగు జతలు చెవిదిద్దులు మొత్తం మూడు తులాల బంగారం చోరీ చేశాడు. అలాగే ఇంట్లో ఉంచిన రెండు సెల్‌ఫోన్లతో పరారయ్యాడు. పెళ్లి వేడుక ముగించుకొని ఇంటికి వెళ్లి చూస్తే బంగారం, సెల్ ఫోన్లు కనిపించలేదు. దీంతో ఆయన న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యూపోర్టు క్రైం ఎస్‌ఐ అప్పలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే న్యూ కాలనీలో కార్డన్ సెర్చ్



వాహనాలు, ఇళ్లు తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతంపేట: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే న్యూకాలనీ ప్రాంతంలో శనివారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈస్ట్ సబ్ డివిజన్ సిబ్బంది సాయంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొని తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వాహనాలు, ఇళ్లను పరిశీలించారు. దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు.

క్లుప్తంగా

అన్న ప్రసాదానికి విరాళాల వెల్లువ



ట్రస్ట్ ప్రతినిధులకు విరాళాలు అందజేస్తున్న తులసీ గార్డెన్‌కు చెందిన దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిత్య శనివారం జరిగే అన్న ప్రసాద కార్యక్రమానికి దాతలు విరివిగా విరాళాలు ఇస్తున్నారు. శనివారం తులసీ గార్డెన్‌కు చెందిన కల్లిగొరి నాయుడు, మంజు భార్గవి దంపతుల కుమారులు పూర్ణ సంపత్, సోహాన్ ఆదిత్య తులసీ రూ.10,116, గాజువాక సెల్లెస్ట్ అపార్ట్‌మెంట్‌కు చెందిన వెంకన్నబాబు, వరలక్ష్మి దంపతులు రూ.5 వేలు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



స్టీల్‌ప్లాంట్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు, సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్టీల్‌ప్లాంట్ కేప్టివ్ పవర్ ప్లాంట్‌కు చెందిన పంప్ హౌస్-2 సమీపంలో మొక్కలు నాటారు. వాటర్ మేనేజ్‌మెంట్ విభాగం అధికారులు చంద్ర భూషణ ప్రసాద్, బి. బైజు, కె. రవిచంద్, ఎస్. భరత్‌కుమార్, బి.పి. శ్రీకాంత్ కళ్యాఫ్, సీపీపీ-2 అధికారి విష్ణుమూర్తి, డి. శ్రీనివాసరావు చేతుల మీదుగా మామిడి, మూడు వేప, ఐదు నేరేడు, మూడు రావి, మూడు జామ, మూడు సపోటా వంటి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణకు సత్యసాయి సమితి చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడ కుటుంబంతో పల్లాకు మిత్ర బంధం

అక్కిరెడ్డిపాలెం: మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి విశాఖకు తీరని లోటని గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుడివాడ అప్పలరామ్మూర్తి అన్నారు. శనివారం పల్లా సింహాచలం మరణవార్త విని తీవ్ర మనోవేదనకు గురయ్యానన్నారు. మాజీ శాసన సభ్యులు పల్లా సింహాచలంతో తమ తండ్రి, మాజీ ఎమ్మెల్యే గుడివాడ అప్పన్నకు మంచి స్నేహంగా ఉండేవారని పేర్కొన్నారు. ఇద్దరు అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో ఉండేవారని తర్వాత పార్టీలు మారిపోయినా.. తర్వా రాజకీయంగా వేరైనా కుటుంబపరంగా మంచి స్నేహబంధాన్ని కలిగి ఉండేవారన్నారు. స్వర్గీయ పల్లా సింహాచలంకు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష ఉన్నారు.

త్యాగం,ప్రేమకు ప్రతీక బక్రీద్



అజీమాబాద్‌లో శాంతియాత్ర నిర్వహిస్తున్న ముస్లింలు



పెదపాలెం ఈద్గాలో ప్రార్థనల్లో ముస్లింలు



ఇస్లాంపేట మసీదు

గాజువాక: బక్రీద్ వేడుకను గాజువాక ప్రాంత ముస్లింలు శనివారం ఘనంగా నిర్వహించారు. త్యాగానికి గుర్తుగా జరుపుకొనే ఈ వేడుక సందర్భంగా గాజువాకలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు అజీమాబాద్‌లోని సున్నీ జామా మసీదు నుంచి కణితి రోడ్, బీసీ రోడ్ మీదుగా ఈద్గా మైదానం వరకు శాంతియాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సున్నీ జామా మసీద్ ఇమామ్ శాకీర్ సారథ్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ త్యాగం, ప్రేమ, సహనం వంటి సద్గుణాల సందేశమే బక్రీద్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్రాన్, సున్నీ జామా మసీదు, మదీనా మసీదు, గౌసియా మసీదు పెద్దలు మహ్మద్ రఫీ, షౌకత్ అలీ, మదీనావలి, రిజ్వాన్, రెహ్మాన్, లుక్మాన్, అన్సర్ వల్లీ, జబ్బర్, మోతి, ఇషాక్, ఎం.డి.ముర్తజా, అమీర్, నన్న, అన్వర్, మున్వర్, గున్నా, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

పెదగంట్యాడ: బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్త దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట, పెదపాలెం, చినపాలెం, 76వ వార్డు నడుపూరు ప్రాంతాల్లో ముస్లిం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో నమాజ్ ఈద్ సమాజ్ ప్రార్థనలు చేశారు. ప్రవక్త ఇబ్రహీం.. అల్లాహుపై తనకున్న దైవ భక్తిని చాటేందుకే తన ఒక్కగానొక్క కుమారుడైన ఇస్మాయిల్‌ను త్యాగం చేసేందుకు సిద్ధ పడిన ఆధ్యాత్మిక ఘటనను గుర్చి ఇస్లాంపేట మత పెద్దలు దావూద్, బాషా,రసూల్, సుభాన్, ముస్తఫా, అన్వర్ బాషా తెలిపారు.దీనికి ప్రతీకగా మొదలైన ఖుర్బానీ సాంప్రదాయం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ దైవం కోసం పవిత్రమైన త్యాగం చేయడానికి సిద్ధం కావాలనే సందేశాన్నిచ్చారు. ప్రేమ, సహనం, విశ్వాసానికి, త్యాగాలకు, కరుణ, ఐక్యతకు మారుపేరు బక్రీద్ అని అన్నారు. కార్యక్రమంలో ఫేక్ నన్నా, మయార్,అమీద్, మస్తాన్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



సందేశమిస్తున్న ఇమామ్ శాకీర్

డైనమిక్ లీడర్ పల్లా

- గాజువాక అభివృద్ధిపై చెరగని ముద్ర
- గాజువాక చివరి సర్పంచ్‌గా ప్రగతి మార్కు
- కార్మిక నేతగా కీర్తి ప్రతిష్టలు సొంతం
- పల్లా సింహాచలం మృతితో గాజువాకలో విషాదం



పల్లా సింహాచలం (ఫైల్)

గాజువాక: మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతితో గాజువాకలో విషాదం అలముకొంది. ఆయన మృతి విషయం తెలుసుకున్న రాజకీయ నాయకులు, సన్నిహితులు, అభిమానులు సంతాపం ప్రకటిస్తున్నారు. గాజువాక అభివృద్ధిలో ఆయన పాత్రను శ్లాఘిస్తున్నారు.

ఇదీ పల్లా ప్రస్థానం

ఐటీఐ చదువుకొని షిప్‌యార్డులో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఆయన రాజకీయంగా కూడా అంచెలంచెలుగా ఎదిగారు. ఉద్యోగం చేస్తూ షిప్‌యార్డులో కార్మిక నాయకుడిగా సేవలందించారు. 1971లో గాజువాక సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు. ఆ కాలంలోనే గాజువాక బాగా విస్తరించింది. అప్పటికే హిందూస్తాన్ షిప్‌యార్డు, హిందూస్తాన్ జింక్, బీహెచ్‌పీవీ వంటి సంస్థలతో పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న గాజువాక అభివృద్ధి గాజువాక విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం ప్రారంభం కావడంతో మరింత వేగవంతమైంది. 1971లో సర్పంచ్‌గా గెలుపొందిన పల్లా సింహాచలం ఈ ప్రాంతంలో సెటిలర్లకు సైతం అండగా నిలబడ్డారు. ఆయన కాలంలోనే ఇందిరా కాలనీ, పైడిమాంబ కాలనీ, సింహగిరి కాలనీ, పెంటయ్యనగర్, కృష్ణానగర్‌లను ఏర్పాటు చేసి సెటిలర్లకు ఆశ్రయం కల్పించారు. ప్రజలకు సంబంధించిన ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొనేవారని ఆయన సన్నిహితులు ఇప్పటికీ చెబుతుంటారు. గాజువాకలో స్పెషలాఫీర్ల పాలన మొదలయ్యేవరకు ఆయనే సర్పంచ్‌గా ఉన్నారు.

రాజకీయ ప్రస్థానం

షిప్‌యార్డులో ఆయన కార్మిక నాయకుడిగా ఉంటూనే 1979లో పెందుర్తి నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా సైకిల్ గుర్తుపై పోటీ చేశారు. అప్పటికి టీడీపీ ఆవిర్భావం కాలేదు. ఆ తర్వాత కొద్దికాలానికి టీఎన్‌టీయూసీ నాయకుడిగా తన సేవలను మరింత విస్తృతం చేశారు. వుడా బోర్డు సభ్యుడిగా పని చేశారు. 1989లో పెందుర్తి నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. మళ్లీ 1994లో విశాఖ-2 నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కాగా, 2000 సంవత్సరంలో గాజువాక మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత 2004లో విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం రాజకీయాలకు దాదాపు దూరంగా ఉన్నారు. ఆయన చిన్న కుమారుడు పల్లా శ్రీనివాసరావు 2009లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి 2014లో, 2024లో గాజువాక ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు.

అమ్మ పేరుతో మొక్క కార్యక్రమానికి శ్రీకారం



పెదగంట్యాడ ఎంపీపీ పాఠశాలలో మొక్క నాటుతున్న డిప్యూటీ మేయర్ గోవింద్

పెదగంట్యాడ: అమ్మ పేరుతో మొక్క నాటాలనే ఆలోచన అద్భుతమని డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ అన్నారు. అమ్మ పేరుతో మొక్క నాటాలని దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు బీజేపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో పెదగంట్యాడ ఎంపీపీ పాఠశాలలో డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ మొక్క నాటి కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమిస్తే.. అది సంపూర్ణ ఆరోగ్యాన్ని సిద్ధింపజేస్తుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటితే సరిపోదని వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. అనంతరం ఒక్కొక్కరు పాఠశాల ఆవరణలో బాదం, జామ, మామిడి, వేప, కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పేర్ల అప్పారావు, నాదెళ్ల జ్యోతి, దీనంకొండ కృష్ణంరాజు, ప్రకాష్, నాగేశ్వరరావు, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో స్వతంత్ర ఆలోచనలు ముఖ్యం

- ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్

సీతంపేట: జీతం కోసమే కాకుండా జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా పిల్లలను తయారు చేయాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్ అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం హైవే సమీపంలోని కస్టమ్స్ జీఎస్టీ నార్కోటిక్స్ జాతీయ అకాడమీ(నాసిన్)లో శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించేతత్వం పెరగాలని, నేటి ఏఐ కాలంలో బట్టీ పట్టే చదువులకు చోటు లేదన్నారు. పిల్లల్లో స్వతంత్రంగా ఆలోచించే మనస్తత్వం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. రోజూ పిల్లలు కొద్దిసేపు అయినా ఆంగ్ల దినపత్రికలు చదవాలని సూచించారు. ఇష్టమైన హాబీల్లో పిల్లలను ప్రోత్సహిస్తే వారు మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాల వైపునకు మళ్లకుండా ఉంటారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ విషయంలో ప్రాధాన్యమివ్వాలన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.

ముగిసిన శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం విశేష పూజలతో ముగిశాయి. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు దివ్యక్షేత్రం చైర్మన్ గుత్తికొండ బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు శ్రీవారు పెదశేష వాహన సేవ, గరుడ వాహన సేవ, సూర్య ప్రభ వాహన సేవ, ముత్యాల పందిరి వాహన సేవలో విహరించారు. అనంతరం శ్రీవారి ద్వితీయ వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆఖరిరోజు శనివారం శ్రీవారికి సుప్రభాత సేవ, అర్చన, భక్తులకు శ్రీవారి దర్శనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, స్వామివారి మూల మంత్ర హోమం, మహాపూర్ణాహుతి, బలిహరణ, వసంతోత్సవం, శ్రీవారి స్నపన తిరుమంజనం, శ్రీవారి చక్రస్నానం, నీరాజనం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.



శ్రీవారి చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



ఈగిల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ మల్లికార్జునరావు, యువత

పరవాడ: మాదకద్రవ్యాల వినియోగం ద్వారా శారీరక, మానసిక సమస్యలతో పాటు నేర ప్రవర్తనలు సమాజ పతనానికి దారి తీస్తాయని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశపాత్రునిపాలెంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వహించారు. టోర్నమెంట్‌లో స్థానిక యువత ఉత్సహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వ్యసనంగా మారితే ఆ కుటుంబం చిన్నాభిన్నమవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరాను అరికట్టేందుకు ప్రజల సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈగిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పిళ్లా శివకృష్ణ, ఏవీ రామారావు, లక్కరాజు శ్రీనివాస్, శనివాడ ప్రకాష్, ఎన్.జనార్దన్‌రావు, పి.రమేష్, ఈగిల్ కానిస్టేబుల్ ఎస్.కేశవరావు పాల్గొన్నారు.

1వ, ప్రతివాదికి సమన్స్
మహారాజశ్రీ గాజువాక సివిల్ జడ్జ్ వారి కోర్టు (జూనియర్ డివిజన్) గాజువాక
O.S. No. 346/2022

Between:
Mukala Venkata Rao & 2 Others ... Plaintiffs 1 to 3
And:
Tokada Sanyasamma & 2 Others ... Defedends 1 to 3

1వ ప్రతి వాదికి సమన్లు

To.
Tokada Sanyasamma, W/o. Surya Rao, R/o. D.No. 13-5-16, B.C.Road, Gajuwaka, VSP-26

పై నుదహరించిన దావా O.S.No. 346/2022 నందు. 1వ ప్రతివాదియైన మీకు ఎన్నిసార్లు సమన్లు Regd. Post మరియు Through Court ద్వారా పంపించినను మీకు సమన్లు సర్వీసు కానందున, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ కాబడినవి. తేది. 24.06.2025 ఉదయం 10.30 నిం॥లకు పై నుదహరించిన కోర్టు వారి ముందు 1వ ప్రతివాదియైన మీ హాజరు నిమిత్తం ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియజేయడం అయినది. అటుల మీరు పైనుదహరించిన కోర్టువారి ముందు మీరు స్వయంగా గాని, మీ పూర్తి భోగట్టా తెలిసిన న్యాయవాది ద్వారా గాని హాజరు కావలసియున్నది. అలా హాజరు కాని పక్షమున, మీ పరోక్షముగా దావా తీర్మానం జరుగును అని అందుమూలంగా 1వ ప్రతివాది అయిన మీకు తెలియచేయడం అయినది.

ఇట్లు
వాది తరుపు న్యాయవాది.
A.MURALI MOHANA RAO
Advocate
26-7-11/1, Jaggu Junction, Kanithi Road, Gajuwaka, Visakhapatnam - 26.
గాజువాక
తేది : 07.06.2025